సాక్షి
నారాయణపేట
గురువారం । 2 । మే । 2024



స్థానికేతరులకే పట్టం

నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానం నుంచి స్థానికేతరులే అత్యధిక సార్లు గెలుపొందారు.

వివరాలు IIలో ▸



.. శ్రీనివాసుడి కల్యాణం

పాలమూరు బాలుర కళాశాల మైదానంలో శ్రీనివాసుడి కల్యాణం వైభవంగా సాగింది.

వివరాలు IVలో ▸

గరిష్టం/కనిష్టం
45.1/26.6

వాతావరణం

ఎండ తీవ్రత రోజురోజుకు పెరుగుతుంది. మధ్యాహ్నం ఉక్కపోత తప్పదు. అప్పుడప్పుడు వడగాల్పులు వీస్తాయి.

మిగిలింది పది రోజులే

లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి ముంచుకొస్తున్న గడువు

- అభ్యర్థుల గెలుపు బాధ్యతలు మోస్తున్న ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు
- వేగం పెంచిన ప్రధాన పార్టీలు
- ఉదయం, సాయంత్రం వేళల్లో పెరుగుతున్న జోరు



సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

సాక్షి, నాగర్‌కర్నూల్: లోక్‌సభ ఎన్నికల పోలింగ్ తేదీ సమీపిస్తున్న కొద్దీ ప్రధాన పార్టీల అభ్యర్థులు తమ ప్రచారవేగాన్ని మరింత పెంచుతున్నారు. ఎన్నికల ప్రచారానికి ఇంకా పది రోజులే (మే11 వరకు) మాత్రమే గడువు ఉండటంతో అభ్యర్థులు మండుటెండలోనూ విరామం లేకుండా పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఏదో ఒక చోట పర్యటిస్తున్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో మొత్తం 31 మంది అభ్యర్థులు, నాగర్‌కర్నూల్ నుంచి మొత్తం 19 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. రెండు స్థానాల్లోనూ ప్రధాన పార్టీల అభ్యర్థుల మధ్య తీవ్రమైన పోటీ నెలకొంది. ఎన్నికల ప్రచార పర్వానికి సమయం తక్కువగా ఉండటంతో పార్టీలు ప్రధానంగా ప్రచార రథాలు, సోషల్ మీడియాపై ఎక్కువగా దృష్టిపెడుతున్నాయి. వీలైనంత ఎక్కువ సంఖ్యలో ప్రచార రథాల ద్వారా వీధుల్లో మైక్‌ల మోతతో ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు.

మండుటెండలతో పరేషాన్..

ఎన్నికలు సమీపిస్తున్న వేళ రోజురోజుకీ ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతుండటం అభ్యర్థులకు తలనొప్పిగా మారింది. సాధారణంగా ఉదయం 10 గంటల తర్వాతే రాజకీయ పార్టీల సభలు, సమావేశాలు, రోడ్‌షోలు ప్రారంభమవుతాయి. అయితే నిత్యం 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతుండటం, ఉదయం 9 గంటల నుంచే భానుడు భగ్గుమంటుండటంతో అభ్యర్థుల ప్రచారానికి ఇబ్బందిగా మారింది. బహిరంగసభలు, రోడ్‌షోలు, సమావేశాల నిర్వహణకు జన సమీకరణ కష్టతరమవుతోంది. దీంతో ఉదయం 6 గంటలకే ముఖ్య పట్టణాలు, మేజర్ గ్రామాల్లో ప్రచారం మొదలుపెట్టి 11 గంటలకే ముగించాల్సి వస్తోంది. మధ్యాహ్నం వేళ ఫంక్షన్ హాలు, మీటింగ్‌హాళ్లలో ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశాలను నిర్వహిస్తున్నారు. తిరిగి సాయంత్రం 5 గంటల తర్వాతే ప్రచారం కోసం కాలు బయట పెట్టాల్సి వస్తోంది. ఎండవేడిమికి పగటి సమయం వృథా అవుతుండటంతో రాత్రి 9 గంటల వరకు అభ్యర్థులు ప్రచారం నిర్వహిస్తున్నారు. ఒక్కో పార్లమెంట్ నియోజకవర్గం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో విస్తృతంగా వ్యాపించి ఉండటంతో ప్రచారానికి సమయం లేక ఎక్కువ ఓటర్లు ఉన్న పట్టణాలు, గ్రామాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తున్నారు. అలాగే ప్రాబల్యం ఉన్న సామాజిక వర్గాల వారీగా సమావేశాలు నిర్వహించి గంపగుత్తగా వారి ఓట్లను పొందేందుకు ఆసక్తి చూపుతున్నారు.

సభలు, సమావేశాలతో ఓటర్లకు గాలం..

ఉమ్మడి జిల్లాలోని రెండు పార్లమెంట్ స్థానాల్లో పాగా వేసేందుకు హస్తం పార్టీ దృష్టిని కేంద్రీకరించింది. సీఎం రేవంత్ సొంతజిల్లా కావడంతో ఈ రెండు స్థానాల్లో గెలుపును ఆ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి ఉమ్మడి జిల్లాలో పలుమార్లు పర్యటించగా, మిగిలిన రోజుల్లోనూ రేవంత్‌తో పాటు పార్టీ జాతీయస్థాయి నేతలను నియోజకవర్గాల్లో ప్రచారానికి రప్పించేందుకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ప్రయత్నాలు సాగిస్తున్నారు. తమ పార్టీ అభ్యర్థులను గెలిపించుకునే బాధ్యతను ఇన్‌చార్జి మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలపై మోపింది. ప్రచారంలో భాగంగా ఆగస్టు 15లోగా రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేసి తీరుతామని కాంగ్రెస్ నేతలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

కేసీఆర్ పర్యటనతో గులాబీలో జోష్..

ఉమ్మడి జిల్లాలోని రెండు పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రెండు రోజుల పర్యటన ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రాల్లో బీఆర్ఎస్ నిర్వహించిన భారీ రోడ్‌షోలో జనసమీకరణ బాధ్యతలను పార్టీ అభ్యర్థులతో పాటు పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు తీసుకున్నారు. కాంగ్రెస్ వచ్చాకే కరెంటు, కరువు కష్టాలు మొదలయ్యాయంటూ బీఆర్ఎస్ విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తోంది.

జాతీయస్థాయి నేతలతో బీజేపీ..

లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ఒకరోజు ముందే నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ పర్యటించి ఎన్నికల వేడిని పెంచారు. ఈసారి ఎన్నికల్లో మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ స్థానాల్లో పాగా వేయాలని బీజేపీ దూకుడుగా వ్యవహరిస్తోంది. నాగర్‌కర్నూల్‌లో అభ్యర్థి నామినేషన్ సందర్భంగా గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్రపటేల్, కేంద్రమంత్రి, రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి రంగంలోకి దిగి ప్రచారాన్ని నిర్వహించారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోనూ వారం రోజుల్లో ఆ పార్టీ జాతీయస్థాయి ముఖ్యనేతలతో ఎన్నికల ప్రచారం నిర్వహణకు బీజేపీ ఏర్పాట్లు చేస్తోంది.

న్యూస్‌రీల్

చట్టాలను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలి



నారాయణపేట: కార్మికుల సంక్షేమం కోసం అనేక చట్టాలు ఉన్నాయని, అవగాహన పెంచుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ లక్ష్మపతిగౌడ్ అన్నారు. ప్రపంచ కార్మికుల దినోత్సవాన్ని (మేడే) ను పురస్కరించుకొని బుధవారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో న్యాయవాది లక్ష్మీపతి గౌడ్ మాట్లాడారు. కార్మికుల హక్కులు, బాధ్యతలను తెలిపేందుకు సదస్సును ఏర్పాటు చేశామన్నారు. న్యాయవ్యవస్థలో ఉచిత న్యాయ సలహాలు ఇచ్చేందుకు లీగల్ డిఫెన్స్ సిస్టం ఉందన్నారు. మహిళలు, ఎస్సీ, ఎస్టీ, మూడు లక్షల లోపు ఆదాయం కలిగిన బీసీలకు ఉచిత న్యాయ సేవలు అందుతాయన్నారు. న్యాయ సలహాల కోసం 15100 నెంబర్‌కు ఫోన్ చేసి సమస్యను చెప్తే పరిష్కారం చూపుతారన్నారు. అదేవిధంగా అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.సురేష్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు సూచనల మేరకు చట్టాలు – హక్కుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఇలాంటి సదస్సులను ఏర్పాటు చేశామని,. కార్మికుల కోసం దోపిడీని నిషేధించే హక్కు, శ్రమ దోపిడీకి గురైన కార్మికుడికి రక్షణ కల్పించే హక్కు, రైట్ టు వర్క్ ఛాయిస్, వివక్ష నుంచి రక్షించే హక్కుతో పాటు సరైన పనికి సరైన వేతన చట్టమే కాకుండా ఇంకా అనేక చట్టాలు ఉన్నాయన్నారు. చట్టాలు, హక్కులు గుర్తింపు లేని కార్మిక సంఘాలకు సైతం వర్తిస్తాయని ఆయన తెలిపారు. అనంతరం కార్మికులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ సునీత, న్యాయవాదులు నాగేశ్వరి, రఘువీర్ పాల్గొన్నారు.

ప్రతి కూలీకి పని కల్పించాలి



నర్వ: జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా ప్రతి కూలీకి పని కల్పించాలని పంచాయతీ రాజ్ డిప్యూటీ కమిషనర్ రవీందర్ అన్నారు. బుధవారం నర్వ మండల పరిషత్ సమావేశం హాల్‌లో ఉపాధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి నర్సింగరావ్‌తో కలిసి మక్తల్, మాగనూర్, కృష్ణ ఊట్కూర్ మండలాల వారీగా సమీక్ష నిర్వహించారు. నర్వ ఉపాధి సిబ్బందితో మాట్లాడుతూ.. మండలంలో ప్రస్తుతం 7985 మంది కూలీలు పనిచేయాల్సి ఉండగా ఇందులో 4వేల మంది కూలీలు పనిచేస్తున్నారని నివేదికలో ఉందన్నారు. కనీసం 60 శాతం మేరకు వీరి సంఖ్యను మరో 2100 వరకు పెంచాలని సూచించారు. ఆయా మండలాల్లో కూలీల సంఖ్యను పెంచుతూ తప్పకుండా ప్రభుత్వం పెంచిన కనీస వేతనం రూ. 300 దినపరి వేతనం అందేటట్లు ఎంపీడీఓలు, ఏపీఓలు చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి పనుల్లో వ్యక్తిగత, ఉమ్మడి సామాజిక మౌళిక వనరుల అభివృద్ధితో పాటు సహజ వనరుల పరిరక్షణకు, అటవి, బంజరు భూములతో పాటు ఎస్సీ, ఎస్టీ బీసీ, చిన్న సన్నకారు రైతుల భూముల్లో కందకాలు వర్షపునీటి నిల్వ కోసం పనులు చేపట్టాలన్నారు. పని ప్రదేశాల్లో నీడ, తాగునీటి వసతి కల్పించాలన్నారు. కూమార్‌లింగంపల్లి, నర్వ మండల కేంద్రంలోని సెగ్రిగేషన్ షెడ్‌లు, వన నర్సరీలను పరిశీలించారు. జడ్పీ సీఈఓ జ్యోతి, డీఆర్డీఓ రాజేశ్వరీ, ఇంచార్జీ ఎంపీడీఓ సుదర్శన్ పాల్గొన్నారు.

కనులపండువగా బీరప్ప ఉత్సవాలు



మక్తల్: కుర్వ కులస్తులకు ఆరాధ్య దైవమైన బీరప్ప దేవర ఉత్సవాలు బుధవారం మండలంలోని మాద్వార్‌లో కనులపండువగా సాగాయి. గ్రామంలోని బీరప్పస్వామి ఆలయం వద్ద బండార కార్యక్రమం నిర్వహించారు. పసుపు శరీరంపై చల్లుకుంటే తమకు సుఖసంతోషాలు కలుగుతాయని వీరి నమ్మకం. అనంతరం బండారు (పసుపు)ను పోటీపడి తమ కుటుంబ సమేతంగా చల్లుకొన్నారు. మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రకాంత్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ కోళ్ల వెంకటేష్, ఎంపీటీసీ బాల్‌రాంరెడ్డి,మాజీ మార్కెట్ డైరెక్టర్ రాజేశ్వర్‌రావు, మాద్వార్‌ఎంపిటిసి ఇందిర, మాజీ ఎంపిటిసి సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా గుడిగండ్లలో యల్లమ్మ బండారు కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. కొండయ్య, శంకరోళ్ల రవికుమార్, సత్యశ్రీను, రాజుగౌడ్ పాల్గొన్నారు.

బాల్యవివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

నారాయణపేట: బాల్య వివాహ రహిత జిల్లాగా నారాయణపేటను తీర్చిదిద్దాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. బుధవారం ధనుంజయ్ టింగల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఇండియా చైల్డ్ ప్రొటెక్షన్ ఫండ్ ఆర్గనైజేషన్ల ఆధ్వర్యంలో కలెక్టర్ సమక్షంలో నారాయణపేటను బాల్య వివాహ రహిత జిల్లాగా మార్చడానికి మెమోరాండం ఆఫ్ అండర్స్టాండింగ్ చేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని కౌమారదశ బాలలను, బడిబయట ఉన్న బాలలను గుర్తించి పాఠశాలలో చేర్పించడం, గ్రామస్థాయిలో బాలిక గ్రూపులు ఏర్పరిచి వారికి శిక్షణ ఇవ్వడం, బాల్యవివాహాలు, బాల కార్మికులుగా మారకుండా ఉండేవిధంగా తయారు చేయాలనే ముఖ్య ఉద్దేశంతో ఒప్పందం చేసుకోవడం జరిగిందన్నారు. అలాగే బాలల హక్కులు, వారికి సంబంధించిన అన్ని చట్టాలపై అవగాహన కల్పించి బాల్య వివాహాల రహిత, బాల కార్మిక రహిత జిల్లాగా జిల్లా ఉండాలనేదే లక్ష్యమన్నారు. సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు, బచ్పన్ బచావో ఆందోళన్ స్టేట్ కోఆర్డినేటర్ అందె వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ యోగేష్‌గౌతమ్

నారాయణపేట: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్పీ యోగేష్ గౌతమ్ అన్నారు. రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో గంజాయి, కల్తీ కల్లు వినియోగం వల్ల జరిగే అనర్థాలపై రూపొందిన వాల్ పోస్టర్‌ను జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం పోలీసు అధికారులతో కలిసి ఎస్పీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మాదకద్రవ్యాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యులు కావాలని, యువత గంజాయికి బానిసలుగా మారి తమ భవిష్యత్తు నాశనం చేసుకొంటుందని, వారి తల్లిదండ్రులు మానసిక క్షోభకు గురవుతున్నారన్నారు. గంజాయి, కల్తీ కల్లు విక్రయాలకు పాల్పడితే ఫిర్యాదు చేయాల్సిన టోల్ ఫ్రీ నంబర్ 8712671111 గల ఈ అవగాహన పోస్టర్లను రూపొందించడం జరిగిందన్నారు. మత్తు పదార్థాలతో భవిష్యత్‌ను కోల్పోవడమే కాకుండా ఎన్నో చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలు చేస్తూ తమ చేతులారా భవిష్యత్‌ను పాడు చేసుకుంటున్నారన్నారు. దానికోసమే ముందుగానే మత్తు పదార్థాలు నిర్మూలించి యువతను మత్తు అనే మహమ్మారి నుండి కాపాడాలని కోరారు. గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రజలందరు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి గంజాయి, మత్తు పదార్థాల విక్రయాలకు పాల్పడేవారి సమాచారాన్ని ఇవ్వాలన్నారు. గంజాయి రహిత జిల్లా కోసం అధికారులు, సిబ్బంది కృషి చేయాలనీ ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో డిఎస్పీలు ఎన్ లింగయ్య, మహేష్, ఎస్‌బి సిఐ రామ్ లాల్, డీసీఆర్‌బి ఎస్ఐ సునీత పాల్గొన్నారు.

జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమలు

నారాయణపేట రూరల్: జిల్లాలో ఈ నెల 29 వరకు 30, 30ఏ పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ యోగేష్‌గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడ కూడా పోలీసుల అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు చేపట్టరాదని, శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు నష్టం కల్గించరాదని తెలిపారు.

పోరాటాలతోనే హక్కుల సాధన



జిల్లా కేంద్రంలో మేడే వేడుకల్లో సీఐటీయూ నాయకులు తదితరులు

నారాయణపేట: కార్మికుల పోరాడి సాధించుకున్న దినమే మేడే అని.. పోరాటాలతోనే హక్కుల సాధన సాధ్యమవుతుందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రామ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పార్కు వద్ద మేడే సందర్భంగా సీఐటీయూ జెండాను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. గతంలో కార్మికుల శ్రమను దోచుకోవడం, దోపిడీ బానిసత్వంలోకి నెట్టబడిన కార్మికవర్గం దారిద్రపు జీవితం నుంచి బయటపడేందుకు కార్మిక వర్గం ఒక్కటై దోపిడీ వర్గంపై పోరాటం చేశారని అన్నారు. కారల్ మార్క్స్ అందించిన 'పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్లు తప్ప' అనే సమరనినాదంతో కార్మిక వర్గం ఒకటై పోరాడిన దినమే మేడే అని అన్నారు. మనదేశంలో స్వాతంత్రం పూర్వం నుండి పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను దేశ ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో ఎన్డీయే ప్రభుత్వం సవరించి నాలుగు కార్మిక కోడ్‌లు అమల్లోకి తెస్తున్నారన్నారు. కార్పొరేట్ విధానాలు మానుకోవాలన్నారు. మరో వైపు మతోన్మాద విధానంతో దేశంలో విద్వేషం నింపుతోందని విమర్శించారు. కార్మికుల కనీస హక్కులైనా కనీస వేతనం, ఉద్యోగ భద్రత, పీఎఫ్ వంటి కార్మిక చట్టాలను అమలు చేయడం లేదని విమర్శించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఉద్యోగ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘం నాయకులు సాయిలు, బాలమణి, సౌభాగ్య, వనిత,ప్రదీప్ జయంత్ రెడ్డి, పవన్ కుమార్, మాసనమ్మ కృష్ణ, మున్నీ బేగం, కార్మికులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో..

నారాయణపేట రూరల్: కార్మిక దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించుకున్నారు. పట్టణంలో ఆర్టీసీ డిపోలో డ్రైవర్, కండక్టర్లు, మెకానిక్‌లు, బస్టాండు ఎదురుగా ఆటో యూనియన్ నాయకులు, ఎలక్ట్రిసిటి కార్యాలయంలో విద్యుత్ కార్మికులు ఎర్రజెండాను ఎగరవేశారు. అదేవిధంగా సీఐటీయూ, పీవైఎల్, పీడీఎస్‌యూ, సీపీఐ(ఎంఎల్)ప్రజాపంథ, సీపీఐ ఆధ్వర్యంలో వేర్వేరుగా బండగొండ, అప్పిరెడ్డిపల్లి, అప్పక్‌పల్లి, సింగారం, అభంగాపూర్, కోటకొండ, జాజాపూర్ గ్రామాల్లో మేడే నిర్వహించారు.

అంబేద్కర్ ఆశయాలను కొనసాగిద్దాం



బహిరంగ సభలో ఐక్యత చాటుతున్న ప్రొఫెసర్ కాసీం, చుక్కరాం నర్సయ్య, నాయకులు

నారాయణపేట రూరల్: రాజ్యాంగ స్ఫూర్తిని మరింత విస్తరిస్తూ.. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను కొనసాగిద్దామని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కాసీం అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం జిల్లా స్థాయి అంబేద్కర్ 2వ జాతరను ఘనంగా నిర్వహించారు. ముందుగా జాతర కమిటీ జిల్లా అధ్యక్షుడు, మున్సిపల్ కౌన్సిలర్ మహేష్ ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీ, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం బహిరంగసభ నిర్వహించగా వక్తలు మాట్లాడారు. ఎంతో ముందుచూపుతో అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించారని, దాన్ని పూర్తి స్థాయిలో అమలుచేస్తే నిమ్న వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. రాజకీయ పార్టీలు తమ స్వార్థం కోసం వాడుకుంటాయని, దాన్ని గుర్తించి చైతన్య వంతులు కావాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. ప్రతి ఒక్కరు తమ పిల్లలను చదివించాలని, విద్యతోనే వెనుకబాటును పూర్తిగా అంతం చేయగలమన్నారు. రాజ్యాంగాన్ని మారుస్తాం అంటూ అవమానపర్చే విధంగా మాట్లాడితే ఊరుకునేదిలేదన్నారు. కార్యక్రమంలో ప్రజా గాయకుడు చుక్కరాం నర్సయ్య, నాయకులు మహేష్, ఈశ్వరమ్మ, చంద్రశేఖర్, రమేష్, చంటి, చిన్నయ్య, హన్మంతు, పద్మ, చిన్నికృష్ణ, కృష్ణ, పాండు, లింగం తదితరులు పాల్గొన్నారు.



వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



క్రీడా శిబిరం ప్రారంభిస్తున్న రాజేంద్రకుమార్

నారాయణపేట రూరల్: క్రీడా శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలను చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని సీఎంఓ రాజేంద్రకుమార్ అన్నారు. స్థానిక మినీ స్టేడియంలో బుధవారం సమ్మర్‌క్యాంపును ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థులు, చిన్నారులకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్‌కు సంబంధించి శిక్షణ అందిస్తున్నామని చెప్పారు. 14 సంవత్సరాలలోపు చిన్నారులు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

34,20,724 మంది ఓటర్లు

పార్లమెంట్ ఎన్నికల ఓటరు తుది జాబితా విడుదల

- మహబూబ్‌నగర్‌లో 16,82,470, నాగర్‌కర్నూల్‌లో 17,38,254 మంది ఓటర్లు
- రెండు లోక్‌సభ స్థానాల్లోనూ మహిళా ఓటర్లే అధికం
- ఓటరు స్లిప్పుల పంపిణీ ప్రారంభం



మహబూబ్‌నగర్ న్యూటౌన్: పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా అధికార యంత్రాంగం ఇటీవల ఓటరు తుదిజాబితాను విడుదల చేశారు. రెండు లోక్‌సభ నియోజకవర్గాల్లో కలిపి 34,20,724 మంది ఓటర్లు ఉన్నారు. తుది జాబితాలో పేర్లు ఉన్నవారే ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. ఇప్పటికే ఓటరు స్లిప్పులను పంపిణీ చేపట్టారు. దాదాపు 30– 40 శాతం మేర పంపిణీ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. అలాగే తుది జాబితా ప్రకటించిన అనంతరం ఓటరు స్లిప్పుల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్లలో కలిపి 8,32,256 మంది పురుషులు, 8,50,172 మహిళలు, 42 మంది ఇతర ఓటర్లు మొత్తం కలిపి 16,82,470 మంది ఉన్నారు. అలాగే నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో 8,64,875 మంది పురుషులు, 8,73,340 మంది మహిళలు, 39 మంది ఇతర ఓటర్లు కలిపి మొత్తం 17,38,254 మంది ఉన్నారు. అయితే ఉమ్మడి జిల్లాలోని రెండు పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని 12 అసెంబ్లీ సెగ్మెంట్లలో కలిపి మహిళా ఓటర్లదే పైచేయిగా ఉంది. కొల్లాపూర్, కల్వకుర్తి అసెంబ్లీ సెగ్మెంట్లలో కాస్త పురుష ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ.. మిగతా నియోజకవర్గాల్లో మాత్రం మహిళా ఓటర్లదే కీలక పాత్ర.

తప్పులు సరిచేసి..

గత అసెంబ్లీ ఎన్నికల్లో రూపొందించిన ఓటరు జాబితాలో అనేక తప్పులు దొర్లాయి. చనిపోయిన వారి పేర్లు, స్థానికంగా లేని వారి పేర్లు జాబితాలో ఉంచారు. కొన్నిచోట్ల స్థానికంగా ఉన్నవారి పేర్లు సైతం లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఇలాంటి తప్పులన్నింటిని సరిచేస్తూ తుది జాబితాను రూపొందించారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో 1,937 పోలింగ్ కేంద్రాలు, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గంలో 2,057 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరు ఓటుహక్కును సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నారు.

మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానం....

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
మహబూబ్‌నగర్	275	1,28,384	1,30,863	13	2,59,260
జడ్చర్ల	274	1,11,053	1,11,779	6	2,22,838
దేవరకద్ర	289	1,18,615	1,21,130	0	2,39,745
నారాయణపేట	270	1,16,497	1,19,682	3	2,36,182
మక్తల్	284	1,19,809	1,24,363	1	2,44,173
కొడంగల్	282	1,18,856	1,22,933	5	2,41,794
షాద్‌నగర్	263	1,19,042	1,19,422	14	2,38,478

నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానం..

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
నాగర్‌కర్నూల్	264	1,17,487	1,18,603	4	2,36,094
అచ్చంపేట (ఎస్సీ)	339	1,23,126	1,24,598	5	2,47,729
కొల్లాపూర్	282	1,20,917	1,18,541	5	2,39,463
వనపర్తి	307	1,35,876	1,37,984	3	2,73,863
గద్వాల	303	1,25,644	1,30,982	11	2,56,637
అలంపూర్ (ఎస్సీ)	291	1,18,391	1,21,662	10	2,40,063
కల్వకుర్తి	271	1,23,434	1,20,970	1	2,44,405

స్థానికేతరులకే పట్టం!

- కందనూలు ఎంపీల్లో ఎక్కువ మంది పార్లమెంట్ సెగ్మెంటేతరులే
- కాంగ్రెస్‌లో పనిచేయని స్థానిక నినాదం

అచ్చంపేట: ఉమ్మడి జిల్లాలో మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గాలు ఉండగా.. నాగర్‌కర్నూల్ సెగ్మెంట్‌ను ఎస్సీలకు రిజర్వు చేశారు. 1952, 1957లలో ద్విసభ్య నియోజకవర్గంగా ఉన్న నాగర్‌కర్నూల్.. 1962 నుంచి లోక్‌సభ నియోజకవర్గంగా ఏర్పడింది. ఇక్కడ ఎక్కువ సార్లు స్థానికేతరులకే ఓటర్లు పట్టం కట్టారు. మొత్తం 15 సార్లు ఎన్నికలు నిర్వహించగా.. ఐదుగురికి 8 సార్లు అవకాశమిచ్చారు.

ఎక్కువ కాలం వలసవాదులే..

1962 నుంచి 2019 వరకు జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఎంపీగా గెలుపొందిన వారే ఎక్కువగా ఉన్నారు. అందులో ఎక్కువ కాలం ఎంపీలుగా కొనసాగిన మల్లు అనంతరాములు, మల్లు రవి ఖమ్మం జిల్లా వైరా మండలం స్నానాల లక్ష్మీపురం కాగా.. 1996, 1999, 2004 ఎన్నికల్లో గెలుపొందిన మందా జగన్నాథం అలంపూర్ నియోజకవర్గంలోని ఇటిక్యాల మండలానికి చెందిన వారు. అయితే 2009 ఎన్నికలకు ముందు జరిగిన నియోజకవర్గ పునర్విభజనలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానం పరిధిలోకి అలంపూర్ మారడంతో జగన్నాథం స్థానికుడిగా మారారు. 2009 ఎన్నికల్లోనూ ఆయన విజయం సాధించారు. ఇక నంది ఎల్లయ్యది హైదరాబాద్‌లోని రాంనగర్ ప్రాంతానికి చెందిన వారు. ఆయన 1979, 1980, 1989, 1991, 1996 ఎన్నికల్లో సిద్దిపేట నియోజకవర్గం నుంచి ఎంపీగా గెలుపొందారు. అనంతరం రెండు పర్యాయాలు రాజ్యసభ సభ్యుడిగా కొనసాగారు. 2014లో కాంగ్రెస్ పార్టీ తరఫున నాగర్‌కర్నూల్ ఎంపీగా గెలుపొందారు. ప్రస్తుత ఎంపీ పోతుగంటి రాములు కల్వకుర్తి మండలం గుండూరుకు చెందిన వారు.

పునర్విభజనలో మారిన స్వరూపం..

నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ పునర్విభజనకు ముందు అచ్చంపేట, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, షాద్‌నగర్, జడ్చర్ల, పరిగి (రంగారెడ్డి), శ్రీశైలం అసెంబ్లీ స్థానాలు ఉండేవి. పునర్విభజన తర్వాత నియోజకవర్గ స్వరూపం మారిపోయింది. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని షాద్‌నగర్, జడ్చర్ల అసెంబ్లీ సెగ్మెంట్లు మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానంలోకి మార్పు చెందగా, మహబూబ్‌నగర్ పరిధిలోని వనపర్తి, గద్వాల, అలంపూర్ అసెంబ్లీ సెగ్మెంట్లు నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోకి వచ్చాయి. పరిగి వికారాబాద్‌లోకి, శ్రీశైలం కర్నూలు జిల్లా ఆత్మకూరులోకి మారాయి. పునర్విభజన తర్వాత నాలుగు సార్లు ఎన్నికలు జరిగాయి.


రామేశ్వర్‌రావు


జేబీ ముత్యాలరావు


ఎం.భీష్మదేవ్


మల్లు అనంతరాములు


వీ.తులసీరాం


మల్లు రవి


మందా జగన్నాథం


నంది ఎల్లయ్య


పోతుగంటి రాములు

ఫలించని స్థానిక నినాదం..

నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానంలో స్థానికులకు టికెట్ కేటాయించాలని 2019, ప్రస్తుత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నేతలు చేసిన డిమాండ్, విన్నపాలు ఫలించలేదు. మరో సారి స్థానికేతరులకే ఎంపీ టికెట్ కేటాయించారు. గతంలో ఇక్కడి నుంచి ఎంపీగా పోటీచేసిన మల్లు రవికి ఎంపీ టికెట్ కేటాయించడాన్ని స్థానికులు జీర్ణించుకోలేకపోతున్నారు. తమకు ఎప్పటికీ అవకాశం దక్కేలా లేదని స్థానిక నాయకులు గుసగుసలాడుకుంటున్నారు.

నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానం నుంచి ఎన్నికైన ఎంపీలు వీరే..

1962	జె.రామేశ్వర్‌రావు	కాంగ్రెస్
1964	జె.రామేశ్వర్‌రావు	కాంగ్రెస్
1967	జేబీ ముత్యాలరావు	కాంగ్రెస్
1971	ఎం.భీష్మదేవ్	తెలంగాణ ప్రజాసమితి
1977	ఎం.భీష్మదేవ్	కాంగ్రెస్
1980	మల్లు అనంతరాములు	కాంగ్రెస్
1984	వీ.తులసీరాం	టీడీపీ
1989	మల్లు అనంతరాములు	కాంగ్రెస్
1991	మల్లు రవి	కాంగ్రెస్
1996	మందా జగన్నాథం	టీడీపీ
1998	మల్లు రవి	కాంగ్రెస్
1999	మందా జగన్నాథం	టీడీపీ
2004	మందా జగన్నాథం	టీడీపీ
2009	మందా జగన్నాథం	కాంగ్రెస్
2014	నంది ఎల్లయ్య	కాంగ్రెస్
2019	పోతుగంటి రాములు	బీఆర్ఎస్

కాంగ్రెస్‌దే పైచెయ్యి..

నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం ఏర్పడిన తర్వాత ఇప్పటి వరకు 15 సార్లు ఎన్నికలు నిర్వహించగా.. తొమ్మిది సార్లు కాంగ్రెస్ అభ్యర్థులు, నాలుగు సార్లు టీడీపీ, ఆ తర్వాత బీఆర్ఎస్, తెలంగాణ ప్రజాసమితి అభ్యర్థులు గెలుపొందారు. ఎక్కువ సార్లు గెలుపొందిన వారిలో మల్లు అనంతరాములు, ఆయన సోదరుడు మల్లు రవి మాల సామాజిక వర్గానికి చెందినవారు కాగా.. జేబీ ముత్యాలరావు, ఎం.భీష్మదేవ్, వి.తులసీరాం, మందా జగన్నాథం, నంది ఎల్లయ్య, పోతుగంటి రాములు మాదిగ ఉపకులానికి చెందిన వారు. ఇక్కడి నుంచి నాలుగు సార్లు ఎంపీగా గెలుపొందిన మందా జగన్నాథం 1999, 2004, 2009 ఎన్నికల్లో వరుసగా ఎన్నికై హ్యాట్రిక్‌ను సొంతం చేసుకున్నారు.

క్లుప్తంగా

కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో అపశ్రుతి

- డాన్స్ చేస్తుండగా గుండెపోటుతో వ్యక్తి మృతి


చిన్న సాయన్న (ఫైల్)

భూత్పూర్: కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో అపశ్రుతి చోటు చేసుకుంది. మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలం వేములలో బుధవారం దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఎమ్మెల్యేకు డప్పుల చప్పుడు.. కార్యకర్త నృత్యాలతో స్వాగతం పలికారు. కాగా.. చాలాసేపు నృత్యం చేసిన చిన్నసాయన్న(53) గుండెపోటు రావడంతో ఆకస్మాత్తుగా కిందపడిపోయారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి వెంటనే తన వాహనం ఇచ్చి చిన్నసాయన్నను జానంపేట ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యంలోనే మృతి చెందాడు. ప్రభుత్వం తరుపున బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని ఎమ్మెల్యే మధుసుదన్‌రెడ్డి తెలిపారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

బిజినేపల్లి: తిమ్మాజిపేట మండలంలోని గుమ్మకొండ సమీప తండాకు చెందిన కేతావత్ రాములు (42) చేపల వేటకు వెళ్లి చెరువులో పడి మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చెరువులో చేపల వేటకు వెళ్లిన రాములు ప్రమాదశావత్తు కాలు జారి అందులో పడి కొట్టుమిట్టాడుతున్నాడు. చెరువు వద్ద పని చేస్తున్న ఉపాధి కూలీలు రాములు పరిస్థితి గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కూలీలు రక్షించే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. కుటుంబ సభ్యులు వచ్చేలోపే నీటిలో మునిగి చనిపోయాడు. గ్రామస్తులు మృతదేహాన్ని బయటికి తీశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు.

కిందపడి వృద్ధురాలు..

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రమాదవశాత్తు కిందపడి ఓ వృద్ధురాలు మృతిచెందిన ఘటన మండలంలోని గుడిపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ గోవర్ధన్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన సుందరమ్మ(70) కొద్దిరోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతుంది. బుధవారం ఇంట్లో ప్రమాదవశాత్తు కిందపడటంతో మృతిచెందింది. సుందరమ్మ అల్లుడు ఊషన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

సిలిండర్ పేలి ఇద్దరికి గాయాలు



మరికల్: ఓ కూల్‌డ్రింక్ షాపు వద్ద సిలిండర్ పేలి ఇద్దరికి గాయాలైన ఘటన బుధవారం సాయంత్రం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. చౌరస్తాలో ఓ కూల్‌డ్రింక్ షాపులో ఉన్న గ్యాస్ సిలిండర్ అకస్మతుగా పేలడంతో పక్కనే ఉన్నా టీస్టాల్‌లో టీ తాగుతున్న మహబూబ్‌నగర్‌కు చెందిన గోపాల్, మరికల్‌కు చెందిన సీమ పెంటన్నలకు గాయాలయ్యాయి. గోపాల్ తలకు తీవ్రంగా గాయం కావడంతో స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేయించి అంబులెన్స్‌లో మహబూబ్‌నగర్ తరలించారు. గోపాల్ నారాయణపేట మండలం కోటకొండ ఆస్పత్రిలోని ల్యాబ్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. ఈ ఘటనపై ఫిర్యాదు అందకపోవడంతో కేసు నమోదు చేయలేదని ఎస్ఐ మురళీ తెలిపారు.

కాంగ్రెస్ నాయకులపై కేసు నమోదు

కొత్తకోట రూరల్: గ్రామాల్లో గోడ గడియారాలు పంచారని బీఆర్ఎస్ నాయకుల ఫిర్యాదు మేరకు కాంగ్రెస్ నాయకులపై కేసు నమోదైంది. కాంగ్రెస్ నాయకులు సోమవారం మండలంలోని నాటవెల్లిపెద్దతండా, బూత్కూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఫొటోలతో ఉన్న గోడ గడియారాలను ఓటర్లకు పంపిణీ చేశారు. దీనిపై ఆధారాలతో జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు మంగళవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశానుసారం మంగళవారం రాత్రి కొత్తకోట ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి కేసు నమోదు చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీచుపల్లియాదవ్, పాండు నాయక్, రాజునాయక్, ధర్మానాయక్, జంపానాయక్, మేఘానాయక్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బుధవారం తెలిపారు.

సౌత్‌జోన్ పోటీలకు బయలుదేరిన క్రీడాకారులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: సౌత్‌జోన్ పోటీలకు పీయూ హ్యాండ్‌బాల్ జట్టు బయలుదేరింది. ఈ జట్టు ఈనెల 5న కేరళలోని మహాత్మ గాంధీ యూనివర్సిటీలో జరుగనున్న పోటీల్లో పాల్గొనున్నారు. క్రీడాకారులకు పీయూ అధికారులు ట్రాక్‌సూట్‌లు అందించారు. కార్యక్రమంలో కంట్రోలర్ రాజ్‌కుమార్, పీడీ శ్రీనివాస్, జియాఉద్దీన్, ప్రదీప్, మన్యం తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులు ఆలోచించి ఓటేయండి


మాట్లాడుతున్న డీకే అరుణ

పాలమూరు: న్యాయవాదుల సమస్యల పరిష్కారంలో తన వంతు సాయం ఎప్పుడూ ఉంటుందని, రాబోయే ఎన్నికల్లో గెలిపిస్తే అండగా ఉంటానని డీకే అరుణ అన్నారు. జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో ఉన్న బార్ అసోసియేషన్ భవన్‌లో మంగళవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా న్యాయవాదులతో ముఖాముఖీ నిర్వహించారు. ఈ దేశ పరిస్థితులు న్యాయవాదులకు తెలుసునని, ఆలోచించి ఓటు వేయాలన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం ఎవరు ఏం చేశారో గుర్తించాలని, మీ అందరి సహకారంతో విజయం సాధిస్తానని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా మోడీకి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక కాంగ్రెస్ విషం చిమ్ముతుందన్నారు. ఓటమి భయంతో కాంగ్రెస్ ప్రజల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్స్ తీసేస్తామని తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. బీజేపీ మైనార్టీలకు వ్యతిరేక పార్టీ అంటూ ఇప్పటికే తప్పుడు ప్రచారం చేశారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, అనంతరెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీతోనే సుపరిపాలన సాధ్యం

- నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్


గుమ్మడంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

పెబ్బేరు రూరల్: దేశంలో సుపరిపాలన, అవినీతి రహిత పాలన కేవలం ప్రధానమంత్రి నరేంద్రమోదీతోనే సాధ్యమవుతుందని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్ అన్నారు. జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రావుల రవీంద్రనాథ్‌రెడ్డితో కలిసి బుధవారం శ్రీరంగాపురం మండల కేంద్రంలోని రంగనాయకస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ప్రచారం ప్రారంభించారు. మండల కేంద్రంతోపాటు వెంకటాపురం, పెబ్బేరు మండలంలోని అయ్యవారిపల్లి, వెంకటాపురం, పాతపల్లి, బూడిదపాడు, ఈర్లదిన్నె, పెంచికలపాడు, జనుంపల్లి, రంగాపురంలో ప్రచారం నిర్వహించారు. సాయంత్రం మండల కేంద్రంలో స్థానిక నాయకులతో కలిసి బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నరేంద్రమోదీ మళ్లీ ప్రధాని కావాలని దేశ ప్రజలందరూ కోరుకుంటున్నారని తెలిపారు. అసెంబ్లీ ఎన్నిక సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నాలుగు కూడా అమలు చేయలేదన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తక్షణమే రైతులకు రూ.2లక్షల రుణ మాఫీ చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి 100 రోజులు దాటినా నెరవేర్చలేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నారాయణ, రాఘవేందర్‌గౌడ్, వేమారెడ్డి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మీకు తెలుసా?

144 సెక్షన్ అంటే..

ఎక్కడ అల్లర్లు, గొడవలు జరిగినా 144 సెక్షన్.. పరీక్ష కేంద్రాలు, మీటింగ్ కేంద్రాలు ఎక్కడ చూసినా 144 సెక్షన్ గురించి వింటుంటాం. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసులు ముందుగా ఉపయోగించే అస్త్రమే ఈ సెక్షన్. అసలు ఇది ఎందుకు.. ఎప్పుడు ఉపయోగిస్తారో తెలుసుకుందాం. భారత శిక్షాస్మృతి 144 ప్రకారం ఒక సంఘటన ప్రజలకు అసౌకర్యం కలిగించేదైనా.. పెద్దఎత్తున గొడవలు, మత, కుల సంబంధమైన ఘర్షణలు తలెత్తినా లేదా అటువంటి అవకాశం ఉన్నా ఈ సెక్షన్ విధిస్తారు. ఇది అమలులో ఉండగా.. నిర్దేశిత ప్రాంతంలో నలుగురు, అంతకంటే ఎక్కువ మంది ఉన్నట్లయితే నేరంగా పరిగణిస్తారు. ఈ నేరాలు రుజువు అయితే రెండేళ్ల జైలుశిక్ష లేదా జరిమానా విధిస్తారు. కొన్ని సందర్భాల్లో రెండూ విధించవచ్చు.

బైండోవర్ అంటే..

ఎన్నికల సమయంలో 'పలువురి బైండోవర్' అనే వార్తలు సర్వసాధారణం. అసలు బైండోవర్ అంటే? 'బాండ్ ఫర్ గుడ్ బిహేవియర్'. ఎన్నికల వేళ శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు పాత నేరస్తులను అదుపులోకి తీసుకుంటారు. రౌడీ షీటర్లు, సారా తయారీదారులు, విక్రేతలు, వివిధ కేసుల్లో ఉన్న నిందితులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి, బైండోవర్ కేసులు పెడుతుంటారు. అనంతరం తహసీల్దార్, ఆర్డీఓ ఎదుట హాజరుపరుస్తారు. సీఆర్‌పీసీ 107, 108, 109, 110 సెక్షన్ల కింద బైండోవర్‌చేసి, తర్వాత వ్యక్తిగత పూచీకత్తుపై వదిలేస్తారు. వీరు తహసీల్దార్ వద్ద బాండ్ పేపర్‌పై చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడబోమని లిఖిత పూర్వకంగా హామీ ఇస్తారు. నగదు లేదా స్థిరాస్తి ష్యూరిటీగా చూపించాల్సి ఉంటుంది.

మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం

- ఎన్నికల సాధారణ పరిశీలకుడు షెవాంగ్ గ్యాచో భూటియా


మైక్రో అబ్జర్వర్లకు సూచనలిస్తున్న ఎన్నికల సాధారణ పరిశీలకుడు షెవాంగ్ గ్యాచో భూటియా

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: లోక్‌సభ ఎన్నికల పోలింగ్ నిర్వహణలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమని సాధారణ పరిశీలకులు షెవాంగ్ గ్యాచో భూటియా అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లకు చెందిన మైక్రో అబ్జర్వర్లకు జిల్లా స్థాయి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఈనెల 13న పోలింగ్ ప్రారంభం నుంచి ముగింపు వరకు అన్ని సంఘటనలను ఎప్పటికప్పుడు తమకు తెలియజేయాలన్నారు. ఆరోజు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఓటింగ్ జరిగేలా చూడాలన్నారు. ముఖ్యంగా మాక్ పోలింగ్, పోలింగ్ ప్రక్రియపై నివేదికలు పంపించాలన్నారు. అనంతరం రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ జి.రవినాయక్ మాట్లాడుతూ ఎన్నికల నియమ నిబంధనలపై మైక్రో అబ్జర్వర్లు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా లోక్‌సభ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. పోలింగ్ రోజు ఉదయం 5.30 గంటలకు మాక్ పోల్, ఏజెంట్లకు వీవీప్యాట్లు ఖాళీగా ఉన్నాయని చూపించి పని మొదలు పెట్టాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో సాయంత్రం ఐదు గంటలలోపు వరుసలో నిలుచున్న ఓటర్లకు, చివరి ఓటరు నుంచి టోకెన్ ఇచ్చి ఓటు వేయడానికి అనుమతించాలన్నారు. కాగా మాస్టర్ ట్రైనర్లు శ్రీకాంత్, నాగరాజు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మైక్రో అబ్జర్వర్ల సందేహాలను నివృత్తి చేశారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు శివేంద్రప్రతాప్, మోహన్‌రావు, మహబూబ్ నగర్, నారాయణపేట ఎల్‌డీఎంలు విజయ్, భాస్కర్, డీఈఓ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

చీరలు, నగదు, మద్యం పట్టివేత


జలాల్‌పూర్ చెక్‌పోస్టు వద్ద పట్టుబడిన చీరలు, నగదుతో పోలీసులు

నారాయణపేట: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా నారాయణపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని జలాల్‌పూర్ సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద బుధవారం పోలీసులు, ఎస్ఎస్‌టీ బృందం సంయుక్తంగా వాహన తనిఖీలు చేపట్టాయి. కర్ణాటకలోని ఇర్కశ్ వ్యాపారి శంకరప్ప నుంచి 390 చీరలు, రూ.64,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. సదరు వ్యాపారి సరైన ఆధారాలు చూపించకపోవడంతో సీజ్ చేసి గ్రీవెన్స్ కమిటీకి అప్పజెప్పినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు వివరించారు.

62.4 లీటర్ల మద్యం..

పోలీసులు దాడులు నిర్వహించి కోటకొండకు చెందిన దస్తప్ప వద్ద రూ.11,700 విలువైన 46.800 లీటర్ల మద్యం, జిల్లాకేంద్రంలోని సరాఫ్‌బజార్‌కు చెందిన గౌరప్ప వద్ద రూ.3,900 విలువగల 15.6 లీటర్ల మద్యాన్ని పట్టుకొని వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు వివరించారు.

ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం

- కేంద్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే
- మంత్రి జూపల్లి కృష్ణారావు


మాధవస్వామినగర్‌లో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

పెంట్లవెల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో కాంగ్రెస్ పార్టీయే గెలుస్తుందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పెంట్లవెల్లి మండలంలోని మాధవస్వామినగర్‌లో మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఆ గ్రామస్తులతో మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి మల్లురవికి హస్తం గుర్తుకు ఓటు వేసి ఆయనను గెలిపించాలని కోరారు. నిత్యం ప్రజల మధ్యలో ఉండే నాయకుడు ఎంతో అనుభవజ్ఞుడు మల్లురవి అని తెలిపారు. 60ఏళ్ల నుంచి కాంగ్రెస్ పార్టీ ఏ పథకం అయితే అమలు చేస్తుందో వాటిని నూటికి నూరు పాళ్లు అమలు చేస్తుందని కార్యకర్తలతో అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను మరికొద్ది రోజుల్లో అమలు చేస్తుందని ఇప్పటి వరకు మహిళలకు ఫ్రీ బస్సు, ఆరోగ్యశ్రీ అమలుపరిచామన్నారు. మండలంలోని మాధవస్వామినగర్, మంచాలకట్ట, ఎంగంపల్లితండా, మల్లేశ్వరంలో అభివృద్ధి చేస్తానని గ్రామస్తులతో మాట్లాడారు. ఇంటింటికీ తిరిగి ప్రజలకు అవగాహన కలిపిస్తూ హస్తం గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం ముమ్మరం చేయాలని ఆయన ముఖ్య కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో నర్సింహయాదవ్, కబీర్, గోవింద్‌గౌడ్, గోపాల్, రామన్‌గౌడ్, గోపినాయక్, తిరుపాటి నాగరాజు, భాస్కర్‌గౌడ్, నర్సింహనాయుడు, ఖాజామైనుద్దీన్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత


కల్వకుర్తిలో మాట్లాడుతున్న ఆర్ఎస్‌పీ

కల్వకుర్తి రూరల్/వెల్దండ/వనపర్తి: రాజ్యాంగ పరిరక్షణకు సమాజంలోని ప్రతిఒక్కరి బాధ్యత అని బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం కల్వకుర్తి పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో స్వేరో నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, అచ్చంపేట నియోజకవర్గాల కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశ గతిని స్థితిని మార్చబోయే ఎన్నికలపై గ్రామీణ ప్రాంతాల ప్రజలకు కనీస అవగాహన లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిఒక్కరూ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల గుణగణాలను, ఆయా పార్టీల ఎన్నికల ప్రణాళికలను ప్రజలకు వివరించాలన్నారు. 75 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో సామాన్య ప్రజలకు రాజ్యాంగంపై, ఎన్నికలపై పార్లమెంట్ ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన ఇంకా రాలేదన్నారు. ఓటు ప్రాముఖ్యత ప్రజలకు వివరించే బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం, ఉప్పల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదప్రజలకు అండగా ఉంటా

వెల్దండ మండల కేంద్రంలో బుధవారం రాత్రి బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎంపీ అవకాశం ఇవ్వండి పేదప్రజల అండగా ఉండి పోరాడుతాం అన్నారు. సంక్షేమ పథకాల అమలుతో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

కార్మికుల సమస్యల పరిష్కారం కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని నాగర్‌కర్నూల్ బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్. ప్రవీణ్‌కుమార్ అన్నారు. ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా వనపర్తిలోని రాజీవ్‌చౌక్‌లో బీఆర్ఎస్ కార్మిక విభాగం జెండాను ఆయన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ప్రధాని నరేంద్రమోడీ గ్యారంటీలతో ప్రజలకు ఒరిగేదేమిలేదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. రూ.వేల కోట్ల ప్రజాధనాన్ని అదాని, అంబానీలకు కట్టబెట్టడానికి బీజేపీ పాలకులు అధికారాన్ని ఉపయోగిస్తున్నారని విమర్శించారు. మోదీ పాలనలో దేశంలోని పేదప్రజల జీవనం ఛిద్రమైందని, మరోసారి బీజేపీని గెలిపిస్తే, కార్మిక లోకానికి తీరం అన్యాయానికి గురవుతుందన్నారు. కేసీఆర్ హయాంలోనే తెలంగాణ రాష్ట్రం వ్యవసాయ రంగంలో దేశంలోనే అగ్రగామిగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, వాకిటి శ్రీధర్, బైకని శ్రీనివాస్, లక్ష్మయ్య, విజయ్, అశోక్, మాణిక్యం, పరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అక్షింతలతో ఓట్లడుగుతున్న బీజేపీ


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

భూత్పూర్/దామరగిద్ద: ప్రజలకు మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, నేడు సంక్షేమాన్ని గాలికి వదిలేశారని, బీజేపీ అక్షింతలు చూపించి ఓట్లు అడుగుతున్నారని రెండు పార్టీలను ప్రజలు నమ్మరని మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. మండలంలోని తాటిపర్తి, కర్వెన, ఎల్కిచర్లలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో రూ.500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్, మహిళలకు రూ.2,500 భృతి, ఆసరా పింఛన్ రూ.4వేలకు పెంపు, కల్యాణలక్ష్మి రూ.లక్షతో పాటు తులం బంగారం ఇస్తామని ప్రజలకు గారడి చేసి అధికారంలోకి వచ్చిందన్నారు. నేడు ప్రజలు గ్రామాల్లో నిలదీస్తారని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రావడం లేదని ఎంపీ విమర్శించారు. బీజేపీ రాముని అక్షింతలు చూపించి, దేవుడి పేరుతో ఓట్లు అడుగుతున్నారని, ఆంధ్రా, కర్ణాటకలో ప్రాజెక్టులకు నిధులు ఇచ్చారని, తెలంగాణకు ప్రాజెక్టులకు నిధులు ఎందుకు ఇవ్వలేదని బీజేపీని ప్రశ్నించారు. 2014లో సీఎం కేసీఆర్ మెనిఫెస్టోలో పెట్టని ఎన్నో సంక్షేమ పథకాలు ప్రజలకు అందించడం జరిగిందని, రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరతో పాటు కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, ఎంతగానో అభివృద్ధి చేశామన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఆయన అన్నారు. మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యధికంగా బీఆర్ఎస్ ఎంపీలు గెలిపిస్తే కాంగ్రెస్ పార్టీ ఎన్నికలల్లో ఇచ్చిన హామీలపై పోరాటాలకు సీఎం కేసీఆర్‌కు బలంగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నరేష్ గౌడ్, చంద్రశేఖర్ గౌడ్, కదిరె ఆశోక్‌రెడ్డి, నారాయణగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్, బీజేపీ మాటలు నమ్మొద్దు

కాంగ్రెస్, బీజేపీ మాయ మాటలను నమ్మి మరోసారి మోసపోవద్దని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం దామరగిద్ద మండల బీఆర్ఎస్ నాయకుడు భీమయ్యగౌడ్ ఫాంహౌస్‌లో ఎంపీ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో మాజీ ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. మహబూబ్‌నగర్ ప్రాంతానికి చెందిన మన్నె శ్రీనివాస్ రెడ్డిని ఎంపీగా గెలిపించుకుంటే ఈ ప్రాంత సమస్యలపై పార్లమెంట్‌లో గళమెత్తుతారన్నారు. ఈ ప్రాంతానికి సంబంధం లేని బీజేపీ, కాంగ్రెస్ నాయకులు కేవలం రాజకీయ లబ్ధి కోసం పోటీ చేసి ప్రజలను మోసం చేసేందుకు వచ్చారన్నారు. దసరా లోపు కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోయి తిరిగి బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి కార్యకర్తలకు భరోసా ఇచ్చారు.

క్లుప్తంగా...

తీన్మార్ మల్లన్నను గెలిపించాలి



సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపునకు కృషి చేయాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.శివసేనారెడ్డి కోరారు. గాంధీభవన్‌లో బుధవారం ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల యూత్ కాంగ్రెస్ సమావేశం జరిగింది. సమావేశంలో అభ్యర్థి తీన్మార్ మల్లన్నతో పాటు మూడు జిల్లాల యువజన కాంగ్రెస్ నాయకులు సమావేశమై కార్యాచరణ గురించి చర్చించారు. ప్రతి పట్టభద్రుడిని కలిసి ఎమ్మెల్సీగా కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు ఆవశ్యకతను వివరించాలని కోరారు. యూత్ కాంగ్రెస్ పక్షాన తీన్మార్ మల్లన్నకు సంపూర్ణ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

ఓయూకి నిధులివ్వకుండా బీఆర్ఎస్ నిర్లక్ష్యం

- అధికార ప్రతినిధి చనగాని దయాకర్

సాక్షి, హైదరాబాద్: పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఉస్మానియా యూనివర్సిటీకి నిధులు, నియామకాలు చేపట్టకుండా నిర్లక్ష్యం చేశారని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ ఆరోపించారు. బుధవారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఓయూకు కేసీఆర్ చేసింది శూన్యమని, ఉస్మానియా భూములు అమ్ముకున్నారని మండిపడ్డారు. గతంలో 1,200 మంది అధ్యాపకులు ఉంటే ప్రస్తుతం 320 మంది ఉన్నారని ధ్వజమెత్తారు. కేసీఆర్ హయాంలో జరిగిన భూ లావాదేవీలపై శ్వేతపత్రం విడుదల చేయాలని దయాకర్ డిమాండ్ చేశారు. ఓయూలో డ్రైనేజీ వ్యవస్థ చాలా దారుణంగా ఉన్నా.. ఒక్క రోజు కూడా పట్టించుకోలేదన్నారు. ఓయూ వందేళ్ల ఉత్సవాల్లో భారీగా అవినీతి జరిగిందని, ఉత్సవాల కాంట్రాక్టు కేటీఆర్ సన్నిహితులకు ఇచ్చారని తెలిపారు. ప్రైవేటు యూనివర్సిటీలకు కేటీఆర్ అనుమతిచ్చి విద్య దోపిడీకి పాల్పడ్డారని దయాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

బస్తర్‌లో నేలకొరిగిన తొలితరం మావోయిస్టు

టేక్‌మెటా ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు తెలంగాణ నేతలు ● మృతుల్లో చీమల నర్సయ్య, కాసరవెల్లి వినయ్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/బెల్లంపల్లి: బస్తర్‌లో మావోయిస్టు పార్టీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్–కాంకేర్ సరిహద్దులో టేక్‌మెటా సమీపంలో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో బస్తర్‌లో నక్సలైట్ ఉద్యమాన్ని ప్రారంభించిన తొలితరం నేతల్లో ఒకరైన చీమల నర్సయ్య ఆలియాస్ జోగన్న, కాసరవెల్లి వినయ్ ఆలియాస్ రవి నేలకొరిగారు. మృతుల ఫొటోలు బయటకు రావడంతో వారి కుటుంబసభ్యులు ఛత్తీస్‌గఢ్‌కు పయనమయ్యారు.

పార్టీ విస్తరణలో నర్సయ్య కీలకపాత్ర

1980వ దశకంలో నక్సలైట్ ఉద్యమం తెలంగాణలో ఊపందుకుంది. కొండపల్లి సీతారామయ్య ఆధ్వర్యంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పార్టీ పట్టు సాధించింది. ఇదే సమయంలో ఉద్యమాన్ని అణచివేసేందుకు ప్రభుత్వం నిర్బంధం పెంచింది. ఈ క్రమంలో తెలంగాణలో తొలి ఎన్‌కౌంటర్ 1982 చివరలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని చినమెట్‌పల్లి దగ్గర జరగ్గా, అంకం నారాయణ, మాసం గజేందర్ చనిపోయారు. ఆ వెంటనే 1983 ఫిబ్రవరి 3న పెద్దపల్లి జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత గణపతి సమకాలికుడు బయ్యపు దేవేందర్‌రెడ్డి మరణించారు. ఆ తర్వాత



ఏప్రిల్‌లో జరిగిన మూడో ఎన్‌కౌంటర్ తెలంగాణ సరిహద్దు మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా అంకీస దగ్గర జరగగా పెద్ది శంకర్ ప్రాణాలు కోల్పోయారు. దీంతో చైనాలో మావో జెడాంగ్ అనుసరించిన వ్యూహం తరహాలో మైదాన ప్రాంతంతోపాటు అటవీ ప్రాంతంలో మరో షెల్టర్ జోన్ కోసం ఆనాటి నక్సలైట్లు అన్వేషణ సాగించారు. ఈ క్రమంలో బస్తర్ అటవీ ప్రాంతాన్ని ఎంపిక చేసుకుని తొలి బ్యాచ్‌ను 1982లో అక్కడకు పంపారు. అలా వెళ్లిన తొలితరం నాయకుల్లో చీమల నర్సయ్య కూడా ఉన్నారు. ఇతని స్వగ్రామం పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలంలోని జయ్యారం. 42 ఏళ్లుగా బస్తర్‌లో పనిచేస్తూ సాయుధ విప్లవానికి బస్తర్ అడవులను కేంద్ర స్థానంగా నిలపగలిగారు. ఇప్పటికీ 'రెడ్ కారిడార్'కు బస్తర్ కీలకంగా ఉంది.

సికాస నుంచి వినయ్

కాసరవెల్లి వినయ్‌ని పార్టీ అగ్రనేత కటకం సుదర్శన్ శిష్యుడిగా చెప్పుకుంటారు. వినయ్ తండ్రి రాజయ్యకు సింగరేణిలో ఉద్యోగం రావడంతో కుటుంబంతో సహా బెల్లంపల్లికి వచ్చాడు. 1990లో విద్యార్థి ఉద్యమాల ద్వారా వినయ్ విప్లవాల వైపు ఆకర్షితుడయ్యారు. ఆ తర్వాత సింగరేణి కార్మిక సమాఖ్య (సికాస)లో కీలకంగా పనిచేశారు. నిర్బంధం ఎక్కువ కావడంతో చెన్నూర్ దళంలో కొంతకాలం పనిచేశాడు. విప్లవ విస్తరణ, మిలిటరీ శిక్షణ, ఆయుధాల తయారీ, సాహిత్యం తదితర పనుల కోసం వినయ్‌ని పార్టీ బస్తర్‌కు పంపించింది. 30 ఏళ్లుగా ఆయన బస్తర్‌లో పార్టీని విస్తరించారు. వినయ్ మరణవార్త తెలుసుకొని ఆయన సోదరుడు వెంకటేష్, కుటుంబ సభ్యులు బుధవారం బస్తర్‌కు బయలుదేరారు. గురువారం వినయ్ మృతదేహాన్ని అతడి స్వగ్రామం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి తరలించే అవకాశాలు ఉన్నట్టు తెలిసింది.

పదిలో 8 మంది గుర్తింపు..

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: నారాయణపూర్ జిల్లాలోని టేక్‌మెటా ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన మావోయిస్టుల వివరాలను బస్తర్ పోలీసులు బుధవారం ప్రకటించారు. మొత్తం పది మంది చనిపోగా ఎనిమిది మందిని గుర్తించారు. ఇందులో ముగ్గురు తెలంగాణకు చెందిన వారు ఉన్నారు. మృతుల్లో పెద్దపల్లి జిల్లా రామగుండం మండలం జయ్యారం గ్రామానికి చెందిన చీమల నర్సయ్య అలియాస్ జోగన్న ఆలియాస్ జీను(66), కాసరబోయిన విన య్ (చెన్నూరు, మంచిర్యాల జిల్లా), సుస్మితా అలియాస్ చైతే (వరంగల్), సంగీత అలియాస్ ఆత్రం డోగే (జోగన్న భార్య, అహేరి, గడ్చి రోలి జిల్లా, మహారాష్ట్ర), సురేశ్ (పశ్చిమ బస్తర్), మల్లేశ్ అలియాస్ మడకం ఉంగా (బస్తర్), పాడి యం కోషి (చింతగుప్ప, సుక్మా), కమ్లీ (కిష్టారం, సుక్మా జిల్లా)లు ఉన్నారు. కాగా, జోగన్న ప్రస్తుతం స్పెషల్ జోనల్ కమిటీ మెంబర్‌గా ఉన్నారు. ఇతనిపై 196 క్రిమినల్ కేసులు నమోదు అవగా రూ.25 లక్షల రివార్డు ఉంది.

పర్యావరణ ప్రతిభా అవార్డులకు పీసీబీ దరఖాస్తుల ఆహ్వానం

సనత్‌నగర్ (హైదరాబాద్): ప్రపంచ పర్యావరణ దినోత్సవం (జూన్ 5) సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (టీఎస్‌పీసీబీ) ఆధ్వర్యంలో ప్రతిఏటా అందించే పర్యావరణ ప్రతిభ అవార్డులకు గాను దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ మేరకు సీనియర్ సామాజిక శాస్త్రవేత్త డాక్టర్ డబ్ల్యూజీ ప్రసన్నకుమార్ బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, ఒకసారి వినియోగించి పడేసే ప్లాస్టిక్ నిషేధం, నీటిపొదుపు, వాయు కాలుష్య నియంత్రణ, వ్యర్థ పదార్థాల నిర్వహణ అంశాల్లో విశేష కృషి చేస్తున్న సంస్థలకు ఈ అవార్డులు అందిస్తారని పేర్కొన్నారు. ఆస్పత్రులు, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు, గ్రామపంచాయతీలు, స్వయం సహాయక బృందాలు, పాఠశాలలు, కళాశాలలు, స్వచ్ఛంద సంస్థలు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. తమ దరఖాస్తులను సనత్‌నగర్‌లోని టీఎస్‌పీసీబీ పర్యావరణ విద్యా విభాగంలో ఈ నెల 15 లోపు అందజేయాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 91773 03127 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

7న బీసీ సంక్షేమ సంఘం విస్తృత స్థాయి సమావేశం

- ఆర్.కృష్ణయ్య వెల్లడి



కాచిగూడ (హైదరాబాద్): లోక్‌సభ ఎన్నికల సందర్భంగా బీసీ సమస్యలపై చర్చించి, ఎన్నికల్లో బీసీలు అనుసరించాల్సిన విధానాలపై తగిన నిర్ణయాలు తీసుకోవడానికి మే 7వ తేదీన కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో జాతీయ స్థాయి విస్తృత స్థాయి సమావేశం నిర్వహి స్తున్నట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రకటించారు. ప్రజాస్వామ్య దేశంలో స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి పాలక పార్టీలు బీసీలకు ప్రభుత్వంలో వాటా ఇవ్వకుండా కేవలం ఓటు వేసే వ్యక్తులుగానే చూశాయని బుధవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీసీలంటే బిచ్చగాళ్లు కాదని, వాటాదారులని పాలక పార్టీలకు తెలిసివచ్చేలా దేశవ్యాప్తంగా బీసీ ఉద్యమాన్ని మరింత ఉధృతంగా చేపట్టనున్నట్లు తెలిపారు. బీసీల వాటా బీసీలకు ఇవ్వకపోతే దేశంలో తిరుగుబాటు తప్పదని ఆయన హెచ్చరించారు. బీజేపీలో ఉన్న బీసీ నేతలు కేంద్ర ప్రభుత్వంపై, పార్టీ జాతీయ నాయకత్వంపై ఒత్తిడి తెచ్చి బీసీల న్యాయమైన డిమాండ్లు పరిష్కార మయ్యేలా చూడాలని ఆర్.కృష్ణయ్య కోరారు.

ఆ ఈవీఎంల వినియోగానికి హైకోర్టు ఓకే

- మేడ్చల్ అసెంబ్లీ ఎన్నికల ఈవీఎంలు.. లోక్‌సభ ఎన్నికల్లో వాడుకునేందుకు ఈసీకి అనుమతి
- మల్లారెడ్డి ఎన్నికను సవాల్ చేస్తూ వజ్రేష్‌యాదవ్ పిటిషన్
- విచారణ చేపట్టిన హైకోర్టు.. ప్రతివాదులకు నోటీసులు




సాక్షి, హైదరాబాద్: మేడ్చల్ అసెంబ్లీ ఎన్నికలకు వినియోగించిన ఈవీఎంలు, వీవీప్యాట్లు పార్లమెంట్ ఎన్నికల్లో వాడుకునేందుకు ఎన్నికల కమిషన్‌కు హైకోర్టు అనుమతి ఇచ్చింది. అలాగే మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఎన్నికను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌లో ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను జూన్ 6కు వాయిదా వేసింది. 2023 నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున మల్లారెడ్డి, కాంగ్రెస్ తరఫున వజ్రేష్‌యాదవ్ పోటీ చేశారు. 33 వేల మెజారిటీతో మల్లారెడ్డి విజయం సాధించారు. అయితే అఫిడవిట్‌లో మల్లారెడ్డి తప్పుడు సమాచారం ఇచ్చారని.. నిర్దీత ఫార్మాట్‌లో వివరాలన్నీ ఇవ్వలేదని ఆయన ఎన్నికను రద్దు చేయాలని కోరుతూ వజ్రేష్ యాదవ్ హైకోర్టులో ఎన్నికల పిటిషన్ దాఖలు చేశారు. సమీప అభ్యర్థి అయిన తనను ఎమ్మెల్యేగా ప్రకటించేలా ఎన్నికల కమిషన్‌కు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. వజ్రేష్ తరఫున న్యాయవాది సిద్ధ పోగుల దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు బుధవారం విచారణ చేపట్టారు. ఎన్నికల కమిషన్, మేడ్చేల్ ఆర్డీవో, అసెంబ్లీ కార్యదర్శి, మల్లారెడ్డితో పాటు ఇతర ప్రతివాదులకు నోటీసులు జారీ చేశారు. అయితే కేసు కారణంగా గోడౌన్‌లో భద్రపరిచిన ఈవీఎంలు, వీవీప్యాట్లను వాడుకునేందుకు అనుమతి ఇవ్వాలని ఈసీ మధ్యంతర పిటిషన్ దాఖలు చేయగా, అందుకు న్యాయమూర్తి అంగీకరించారు.

పల్లా రాజేశ్వర్‌రెడ్డికి నోటీసులు

జనగామ అసెంబ్లీ నుంచి ఎమ్మెల్యేగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి (బీఆర్ఎస్) ఎన్నికను సవాల్ చేస్తూ కొమ్మూరి ప్రతాపరెడ్డి(కాంగ్రెస్) హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సమీప ప్రత్యర్థినైన తనను శాసనసభ్యుడిగా ప్రకటించేలా ఎన్నికల కమిషన్‌కు ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై కూడా న్యాయమూర్తి జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు బుధవారం విచారణ చేపట్టారు. వాదన తర్వాత.. రాజేశ్వర్‌రెడ్డి సహా ఇతర ప్రతివాదులకు న్యాయమూర్తి నోటీసులు జారీ చేస్తూ, విచారణను జూన్ 14కు వాయిదా వేశారు.

దిశ కేసులో పోలీసులకు ఊరట

సిర్పుర్కర్ కమిషన్ నివేదిక ఆధారంగా చర్యలపై హైకోర్టు స్టే



సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన దిశ అత్యాచారం, హత్యకు సంబంధించి నిందితుల ఎన్‌కౌంటర్ కేసులో పోలీసు అధికారులకు హైకోర్టులో ఊరట లభించింది. సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన సిర్పుర్కర్ కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఇప్పుడే ఎలాంటి చర్యలు చేపట్టవద్దని ఆదేశించింది. తాము తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు స్టే ఉత్తర్వులు అమల్లో ఉంటాయని స్పష్టం చేస్తూ, విచారణను జూలై 10కి వాయిదా వేసింది.

ఆ నివేదిక సరిగా లేదంటూ హైకోర్టును ఆశ్రయించిన పోలీసులు

➡ 2019లో దిశ అత్యాచారం, హత్య కేసు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం విదితమే. ఈ కేసులోని నిందితులను కొద్ది రోజులకే పోలీసులు ఎన్‌కౌంటర్ చేశారు. ఎన్‌కౌంటర్‌పై ఆరోపణలు రావడంతో ఈ ఘటనపై విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు సిర్పుర్కర్ కమిషన్‌ను నియమించింది. దిశ నిందితులను ఎన్‌కౌంటర్ చేసిన పోలీసు అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కమిషన్ 2022లో అందజేసిన నివేదికలో సూచించింది. పోలీసు అధికారులపై హత్యానేరం కింద కేసులు నమోదు చేసి విచారణ జరపాలని పేర్కొంది. అయితే దిశ నిందితుల ఎన్‌కౌంటర్‌కు సంబంధించి సిర్పుర్కర్ కమిషన్ ఇచ్చిన నివేదిక సరిగా లేదని, దాని ఆధారంగా తమపై చర్యలు తీసుకోకుండా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ ఇన్‌స్పెక్టర్ సుధీర్‌కుమార్ సహా పలువురు పోలీసులు, ఫరూక్‌నగర్ ఇంచార్జి ఎమ్మార్వో పాండు హైకోర్టును ఆశ్రయించారు.

అప్పటివరకు చర్యలొద్దన్న హైకోర్టు

ఈ పిటిషన్లపై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి బుధవారం విచారణ చేపట్టారు. సీనియర్ న్యాయవాదులు వేణుగోపాల్, రచనారెడ్డి, హేమేంద్రనాథ్ పిటిషనర్ల తరఫున వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. తదుపరి విచారణ వరకు అధికారులపై ఎలాంటి చర్యలు చేపట్టవద్దని ఆదేశిస్తూ, విచారణ వాయిదా వేశారు. కాగా, 'దిశ' ఎన్‌కౌంటర్‌కు సంబంధించి పలుప్రజాప్రయోజన వ్యాజ్యాలు, రిట్ పిటిషన్లు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం వద్ద పెండింగ్‌లో ఉన్న విషయం తెలిసిందే.

ప్రభుత్వ వైఫల్యాలు వివరించాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, దీనిని ప్రజలకు వివరించాలని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. బుధవారం స్థానిక న్యూటౌన్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛన్ ఇవ్వలేదని మహిళలు.. రైతుబంధు, రుణమాఫీ చేయలేదని రైతులు.. ఉద్యోగాలు భర్తీ చేయలేదని యువత.. ఇలా అన్ని వర్గాలు రాష్ట్ర ప్రభుత్వంపై వ్యతిరేకతతో ఉన్నారన్నారు. మహబూబ్‌నగర్‌లో ఇప్పటికే నీటి ఎద్దడి ఏర్పడిందని, రోడ్లపైకి ప్రజలు వచ్చి ఆందోళనకు దిగుతున్నారని పేర్కొన్నారు. కరెంటు కోతలతో ప్రజలు, రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. తమ పదేళ్ల హయాంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితులు లేవన్నారు. పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తలు, నాయకులకు అండగా నిలుస్తామన్నారు. ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డికి మద్దతుగా వార్డులు, గ్రామాల వారీగా విస్తృత ప్రచారం చేయాలన్నారు. సమావేశంలో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీమంత్రి లక్ష్మారెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ కె.వెంకటయ్య, ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న, రాజేశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలుకు సహకరించని రాష్ట్రం

- దేశ భద్రతకు కొనసాగుతున్న ఎన్నికలు
- 400పైగా సీట్లు సాధించడం ఖాయం
- కేంద్ర సమాచార ప్రసార శాఖ సహాయ మంత్రి మురుగన్

నాగర్‌కర్నూల్: కేంద్ర ప్రభుత్వం తెలంగాణలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించడం లేదని కేంద్ర సమాచార ప్రసార శాఖ సహాయ మంత్రి ఎల్.మురుగన్ ఆరోపించారు. బుధవారం నాగర్‌కర్నూల్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ ఎన్నికలు మోదీ కోసం, దేశభద్రత కోసం జరుగుతున్న ఎన్నికలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశ సంక్షేమంతో పాటు మహిళా శక్తి, రైతులపై ప్రత్యేకమైన దృష్టి సారించిందని అన్నారు. మోదీ హయాంలోనే అసాధ్యం అనుకున్న ఆర్టికల్ 370 రద్దు చేయడంతో పాటు 500 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న అయోధ్య రామమందిర నిర్మాణం పూర్తిచేశారన్నారు. రామ మందిర నిర్మాణం చేయడమే కాకుండా, దేశ ప్రజలు దర్శించుకునేందుకు 36 రైళ్లు ఏర్పాటు చేశారన్నారు. ఆయోధ్య రామమందిరం మన జీవితంలో ఓ భాగమని అన్నారు. కేసీఆర్, ఇండియా కూటమి నుంచి ఏ ఒక్కరూ ప్రధాని అయ్యే అవకాశం లేదని ప్రధాని అయ్యే అవకాశం ఒక్క నరేంద్ర మోదీకి మాత్రమే ఉందన్నారు. 400 సీట్లకుపైగా బీజేపీ గెలుస్తుందని, అందులో నాగర్‌కర్నూల్ కూడా ఉంటుందని అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర సమాచార ప్రసార శాఖ సహాయ మంత్రి మురుగన్

కల్వకుర్తి టూ నంద్యాల పనులు..

నాగర్‌కర్నూల్ జిల్లాలో ఇప్పటికే రూ.1400 కోట్లతో కల్వకుర్తి టూ నంద్యాల పనులు కొనసాగుతున్నాయని, వీటితో పాటు కృష్ణా నదిపై ఐకానిక్ బ్రిడ్జి కూడా నిర్మిస్తామన్నారు. గద్వాల– మాచర్ల రైల్వేలైన్‌కు సంబంధించి సర్వే పూర్తి చేసి రిపోర్ట్ కేంద్ర ప్రభుత్వం వద్ద ఉందని, ఈ ఎన్నికల తరువాత దీనిపై నిర్ణయం తీసుకుంటారని అన్నారు. నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల జిల్లాలకు కేంద్రీయ విద్యాలయాలు మంజూరయ్యాయని, ఈ ఫైల్ కలెక్టర్ల వద్ద పెండింగ్‌లో ఉందని అన్నారు. అమిత్ షాపై తప్పుడు ప్రచారం చేస్తున్న కేసులో ఇప్పటికే రేవంత్‌రెడ్డికి నోటీసులు ఇచ్చామన్నారు. రిజర్వేషన్ల రద్దు, రాజ్యాంగం మార్పుపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని, దీనిపై ఇప్పటికే ప్రధాని ప్రకటన కూడా చేశారన్నారు. రాజ్యాంగాన్ని మార్చడం, రిజర్వేషన్ల రద్దు ఉండదని స్పష్టం చేశారన్నారు. కేసీఆర్ కేంద్రంలో చక్రం తిప్పే అవకాశమే లేదని, ఇప్పటికే కేసీఆర్ కుమార్తె జైలులో ఉన్నారని, త్వరలో కేసీఆర్‌కు కూడా ఇదే గతి పడుతుందని అన్నారు. ఎంపీ రాములు మాట్లాడుతూ.. తాను పార్లమెంట్‌లో ఎక్కువ సేపు మాట్లాడలేదని పార్లమెంట్‌పై అవగాహన లేనివాళ్లు మాట్లాడుతున్నారని, సంఖ్యా బలాన్ని బట్టి స్పీకర్ అవకాశం ఇస్తారని అన్నారు. ఇప్పటికే ఒక జాతీయ రహదారి పనులు కొనసాగుతున్నాయని దీనిపై కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడానని అన్నారు. గద్వాల–మాచర్ల రైల్వేలైన్ గురించి కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడితే జాయింట్ వెంచర్ కింద పనులు చేపడదామని, కేంద్రం చెప్పిందన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వానికి లేఖరాసినా.. స్పందించడం లేదన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దిలీప్, ప్రభారి అశోక్‌రెడ్డి, బీజేపీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల చీఫ్ ఎలక్షన్ ఏజెంట్ జక్కా రఘునందన్‌రెడ్డి, బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులను సందర్శించిన సీఈ

- సంబంధిత అధికారులతో భద్రతపై ఆరా

ధరూరు: మండలంలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు, ర్యాలంపాడు రిజర్వాయర్లను ప్రాజెక్టుల సీఈ రఘునాథరావు బుధవారం ఎస్ఈ శ్రీనివాసరావుతో కలిసి సందర్శించారు. ముందుగా జూరాల ప్రాజెక్టు రిజర్వాయర్, గేట్లు పరిశీలించారు. ప్రస్తుతం ప్రాజెక్టులోని నీటిమట్టం, తాగునీటి అవసరాలకు దిగువకు విడుదల చేస్తున్న నీటి వివరాలను పీజేపీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వేసవి నేపథ్యంలో తాగునీటి ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందా.. ఉంటే ప్రాజెక్టులోని నీరు ఎన్నిరోజుల వరకు సరిపోతాయన్న వివరాలపై ఆరా తీశారు. అనంతరం ర్యాలంపాడు రిజర్వాయర్‌ను సందర్శించి లీకేజీ ఏర్పడిన ప్రాంతాన్ని పరిశీలించారు. లీకేజీతో ప్రతి సీజన్‌లో ఎంతమేర నిల్వ నీరు ఎంత వృథా అవుతుందో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ముచ్చోనిపల్లి రిజర్వాయర్‌ను సందర్శించారు. త్వరలో ఈఎన్‌సీ అధికారులు ప్రాజెక్టుల భద్రతను పరిశీలించేందుకు రానున్న నేపథ్యంలో సీఈ పర్యటించినట్లు తెలుస్తోంది. ఆయన వెంట ఈఈ వెంకటేశ్వరరావు, డీఈ శివప్ప, ఏఈ వెంకట్రామిరెడ్డి తదితరులు ఉన్నారు.



ముచ్చోనిపల్లి రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న సీఈ రఘునాథరావు, ఎస్ఈ శ్రీనివాసరావు

వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న మహబూబ్‌నగర్ కలెక్టర్ జి.రవినాయక్

మహబూబ్‌నగర్ క్రీడలు: వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను చిన్నారులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ జి.రవినాయక్ అన్నారు. జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో గల ఇండోర్‌హాల్‌లో యువజన, క్రీడాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి శిబిరాలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నెల రోజుల పాటు శిక్షణా శిబిరాలు ఉంటాయని, రెగ్యులర్‌గా రావాలని సూచించారు. క్రీడా శిక్షణా శిబిరాల్లో పాల్గొంటే ఫిట్‌నెస్‌గా ఉంటామన్నారు. జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి ఎస్.శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ ఏడాది వేసవిలో జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో 11, పట్టణస్థాయిలో 12 చోట్ల వేసవి శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 31వ తేదీ వరకు ఈ శిబిరాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడలశాఖ సూపరింటెండెంట్ రాజగోపాల్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్, జిల్లా యోగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బాల్‌రాజు, జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎల్.రవి కుమార్ పాల్గొన్నారు. జిల్లాకేంద్రంలోని అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్ శిబిరాలు చిన్నారులు, విద్యార్థులతో కిటకిటలాడాయి.

కనులపండువగా శ్రీనివాసుడి కల్యాణం

- తిలకించిన భక్తజనసందోహం
- భక్తిశ్రద్ధలతో ఉత్సవ మూర్తుల పల్లకీసేవ

స్టేషన్ మహబూబ్‌నగర్: పాలమూరు పట్టణంలో బుధవారం రాత్రి శ్రీనివాసుడి నామస్మరణ మార్మోగింది. జిల్లా బ్రాహ్మణ సేవాసమితి, పరశురామ బ్రాహ్మణ అర్చక పురోహితసంఘం సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాస కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ఈ మహోత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొని కల్యాణాన్ని తిలకించారు.

ఉత్సవ మూర్తుల పల్లకీసేవ

ఉత్సవ మూర్తుల పల్లకీసేవ శోభాయాత్ర భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కళాశాల ప్రధాన గేటు ఎదుట నుంచి కల్యాణం వేదిక వరకు వైభవంగా సాగింది. అనంతరం గణపతిపూజ, పుణ్యాహవాచనం ఇతర పూజలు చేశారు. ప్రముఖ గాయకుడు గద్వాల చంద్రశేఖరరావు అన్నమయ్య సంకీర్తనలు ఆలపించారు. అదేవిధంగా మరికొంత మంది మన్యంకొండ క్షేత్రంపై భక్తిగేయాన్ని ఆలపించారు. దేవతామూర్తులను అలంకరించి హారతి పూజలు నిర్వహించారు. ఆనందాచార్యులు శ్రీనివాస కల్యాణం గురించి వివరించారు. శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాస కల్యాణం వేదమంత్రోచ్చరణ మధ్య వైభవంగా నిర్వహించారు. అనంతరం నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పాల్గొన్న ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు

కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీప్రసన్న సతీసమేతంగా పాల్గొని స్వామి వారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఈ కల్యాణ మహోత్సవంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి, అశ్లేషారెడ్డి దంపతులు, బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్‌తో పాటు పలువురు పట్టణ ప్రముఖులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వారిని సన్మానం చేశారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు కొల్లూరు భీమాచార్యులు, ప్రధాన కార్యదర్శి గొండ్యాల రాఘవేంద్ర శర్మ, జోషి సంతోషాచార్యులు, ప్రదీప్ ఆచార్య, తోటపల్లి శ్రీకాంత్‌శర్మ, శ్రవణ్, ఇరువింటి శ్రవణ్ కుమార్ శర్మ, సుమన్ శర్మ, గంగాపురం పవన్‌కుమార్ శర్మ, రామకృష్ణశర్మ, గుండ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



స్వామివారికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఎమ్మెల్యే యెన్నం దంపతులు, చిత్రంలో డీకే అరుణ, వంశీచంద్‌రెడ్డి తదితరులు



కల్యాణోత్సవానికి హాజరైన పట్టణవాసులు

శ్రామికుల పండుగ మే డే

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కులమతాలకు అతీతమైన శ్రామికుల పండుగ మే డే అని జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) బెక్కం జనార్దన్ అన్నారు. శ్రీశ్రీ జయంతి, మేడేను పురస్కరించుకుని బుధవారం మహబూబ్‌నగర్‌లోని వాగ్దేవి జూనియర్ కళాశాలలో కవి సమ్మేళనం నిర్వహించారు. ఇందులో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి సుమారు 45 మంది కవులు పాల్గొని తమ కవితలను వినిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అప్పట్లో చికాగోలో వేలాది మంది కార్మికులు రోడ్డుపైకి వచ్చి తమ ప్రధాన హక్కుల కోసం వీరోచిత పోరాటం చేశారన్నారు. చివరకు ఆరుగురి బలిదానం, వారి త్యాగనిరతితో వాటిని సాధించుకున్నారని పేర్కొన్నారు. సీపీఎం సీనియర్ నాయకుడు, సామాజికవేత్త ఆర్.రాంరెడ్డి మాట్లాడుతూ కష్టజీవుల గొంతుకగా శ్రీశ్రీ కవిత్వం నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ సాహితి రాష్ట్ర అధ్యక్షుడు వల్లభాపురం జనార్దన, జిల్లా అధ్యక్షుడు ఖాజామైనొద్దీన్, ప్రధాన కార్యదర్శి కొప్పోలు యాదయ్య, ప్రచార కార్యదర్శి ఆర్.ప్రమోద్ కుమార్, వాగ్దేవి కళాశాల నిర్వాహకులు విజేత వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కోర్టు పీపీ బెక్కం జనార్దన్